సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 11 । జనవరి । 2023



బొమ్మను చేసి..ప్రాణం పోసి
ధర్మవరం నిమ్మలకుంట కళాకారులు తోలుబొమ్మలకు ప్రాణం పోస్తున్నారు. ప్రాచీన కళను కాపాడుకుంటూ అంతర్జాతీయంగా పేరు గాంచారు. IIలో



టమాట కిలో రూ.13
అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్ట ధర రూ.3 పలికింది.

గరిష్టం/కనిష్టం
31.9°/7.6°

జిల్లా అంతటా మంగళవారం చలి తీవ్రత కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి.

చిరువ్యాపారికి తోడు

జనరంజక పాలనతో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిరువ్యాపారులకూ భరోసా ఇచ్చారు. పెట్టుబడి కోసం ఎవరి వద్దా చెయ్యి చాపకుండా, వడ్డీవ్యాపారుల వలలో చిక్కుకోకుండా బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తున్నారు. సకాలంలో రుణం తీర్చే వారి వడ్డీని సైతం తిరిగి చెల్లిస్తూ చిరువ్యాపారుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు.



- పెట్టుబడి కోసం వడ్డీలేని రుణాల మంజూరు
- వ్యాపారి అసలు చెల్లిస్తే... వడ్డీ ప్రభుత్వమే కడుతుంది
- కంతులు తీరాక మళ్లీ కొత్తగా రుణాల మంజూరు
- ఇప్పటికే నాలుగు విడతల వడ్డీ సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో జమ
- నేడు ఐదో విడతలో 10.485 మందికి రూ.10.18 కోట్ల లబ్ధి

పుట్టపర్తి టౌన్/హిందూపురం: రోడ్డుపై బండి పెట్టుకుని పండ్లు అమ్ముకునే పెద్దాయన...గంప నెత్తిన పెట్టుకుని ఇంటింటికీ తిరిగి కూరగాయలు విక్రయించే మహిళ...పుట్‌పాత్‌పై ఆకుకూరలు అమ్ముకునే ముసలవ్వ.. వీరంతా రెక్కల కష్టంపైనే ఆధారపడి బతుకుతారు. ఆర్థికంగా స్థితిమంతులు కారు. వీరిని నమ్మి చేబదులు ఇచ్చేవారు తక్కువే. అందుకే వ్యాపారానికి పెట్టుబడి కావాలంటే గతంలో వీరంతా వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే వారు. రోజుకు, వారానికి, నెలకు చొప్పున వడ్డీ లెక్కగట్టి చిరు వ్యాపారుల రెక్కల కష్టాన్ని వడ్డీ వ్యాపారులు దోచేసేవారు. తన సుదీర్ఘ పాదయాత్రలో చిరువ్యాపారుల తిప్పలు చూసిన జగన్‌మోహన్‌రెడ్డి...అధికారంలోకి రాగానే వారి సంక్షేమం కోసం 'జగనన్న తోడు' పథకాన్ని ప్రవేశపెట్టారు. చిరు వ్యాపారులు, హస్తకళాకారులు, సంప్రదాయ చేతివృత్తుల వారికి ఏటా రూ.10 వేల చొప్పున వడ్డీ లేని రుణాలు అందజేస్తూ వారి ఉపాధికి ఊతమిస్తున్నారు. జగనన్న తోడు పథకం కింద నాలుగు విడతల్లో 41,730 మందికి రూ.42.03 కోట్ల వడ్డీ సొమ్ము ఇప్పటికే లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యింది.

ఐదో విడత వడ్డీ జమ

జగనన్న తోడు పథకంలో భాగంగా ఐదో విడతలో జిల్లాలోని 10,485 మందికి రూ.10.18 కోట్ల వడ్డీ సొమ్ము బుధవారం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

ఆరో విడతకు సన్నాహాలు

ఆరో విడత జగనన్న తోడుకు చిరు, సంప్రదాయ వ్యాపారులు గుర్తింపు ప్రక్రియ సచివాలయాల ద్వారా జరుగుతోంది. ఇందుకోసం వలంటీర్ల సర్వే చేయించి అర్హులుగా గుర్తించిన వారి జాబితాను సచివాలయాల బోర్డుల్లో ప్రదర్శించి సామాజిక తనిఖీ నిర్వహిస్తారు. ఈ జాబితాలకు ఎంపీడీఓ, జాయింట్ కలెక్టర్లు ఆమోదం తెలుపుతారు. పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు క్యూఆర్ కోడ్ కలిగిన స్మార్ట్ గుర్తింపు కార్డును అందజేస్తారు. అనంతరం జిల్లా అధికారులు తుది జాబితాను అన్ని బ్యాంకులకు పంపుతారు. బ్యాంకు ఖాతాలు లేని వారు కొత్తగా బ్యాంకు పొదుపు ఖాతా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటారు. మొత్తంగా అర్హులకు ఎవరి సిఫారసు లేకుండానే రుణాలు మంజూరవుతాయి.

నేడు కలెక్టరేట్‌లో కార్యక్రమం

జగనన్న తోడు ఐదో విడత వడ్డీ జమ, ఆరో విడతకు బుధవారం శ్రీకారం చుడుతున్నారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమం ప్రారంభించనుండగా, కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్, జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. అనంతరం జిల్లా లబ్ధిదారులకు మెగాచెక్కు అందించనున్నారు.

జగనన్న తోడు వడ్డీ జమ ఇలా...

ఆర్థిక సంవత్సరం	లబ్ధిదారులు	రూ.కోట్లలో
2020-21	9,995	09.95
2021-22	10,851	10.85
2021-22	1,042	11.04
2022-23	9,842	09.82
2022-23	10,485	10.18
మొత్తం	52,215	52.21

వడ్డీలేకుండా రుణాలిచ్చారు



నేను పదేళ్లుగా రోడ్డుపక్కనే తోపుడుబండిలో కూల్‌డ్రింక్, సోడా విక్రయిస్తూ జీవనం సాగించేవాడిని. పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారిని ఆశ్రయిస్తే రూ.వెయ్యికి రూ.100 వడ్డీ పట్టుకుని రూ.900 చేతికి ఇచ్చేవారు. 10 రోజుల్లో రూ.వెయ్యి కట్టాల్సివచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 'జగనన్న తోడు' పథకం కింద వడ్డీ లేకుండా రెండుసార్లు రూ.10 వేల చొప్పున రుణం మంజూరు చేశారు. దీంతో వడ్డీల బాధలు తప్పాయి. వ్యాపారానికి పెట్టుబడి అందిస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

– మునాఫ్, సోడాబండి వ్యాపారి, హిందూపురం

వడ్డీల బాధ తీరింది



నేను మిక్చర్ బండి పెట్టుకుని జీవనం సాగిస్తున్నా. పెట్టుబడికోసం గతంలో అప్పు తీసుకునే వాడిని. వచ్చే ఆదాయంలో ఎక్కువ మొత్తం వడ్డీకే వెచ్చించాల్సి వచ్చేది. జగనన్న తోడు పథకం కింద ప్రభుత్వం రూ.10,000 చొప్పున రెండుసార్లు రుణం మంజూరు చేసింది. ఆ డబ్బుతో వ్యాపారం చేసుకుంటున్నా. వడ్డీ బాధ లేకపోవడంతో మా జీవనం మెరుగైంది.

– కృష్ణ, మిక్చర్‌బండి వ్యాపారి, హిందూపురం

ఆరో విడతలో మరింత మందికి లబ్ధి



ఆరో విడతలో 'జగనన్న తోడు' పథకం కింద 15 వేల మందికి ఆర్థిక సాయం అందించాలనే లక్ష్యంతో ఉన్నాం. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు సేకరించి అర్హులైన వారిని ఎంపిక చేస్తున్నాం. చిరువ్యాపారాలకు జగనన్న తోడు పథకం ఆసరాగా నిలుస్తోంది.

– నరసయ్య, పీడీ, డీఆర్‌డీఏ

న్యూస్‌రీల్

రేపు మెగా జాబ్ మేళా

హిందూపురం టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ మహిళా కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి అబ్దుల్ ఖయ్యూం, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఎం రామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో 17 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని వెల్లడించారు. 10వ తరగతి, ఇంటర్, డిప్లమో, ఐటీఐ, డిగ్రీ, పీజీ పూర్తి చేసి, 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న యువతీ, యువకులు అర్హులన్నారు. ఎంపికైన వారికి కంపెనీ, ఉద్యోగం ఆధారంగా నెలకు రూ.10 వేల నుంచి రూ.30 వేల దాకా వేతనం ఉంటుందన్నారు. ఎంపికైన వారు పెనుకొండ, పుట్టపర్తి, అనంతపురం జిల్లాలతో పాటు బెంగళూరులో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే వారు బయోడేటాతో పాటు, ఆధార్ కార్డు, విద్యార్హత పత్రాలు తీసుకుని 12వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ మహిళా కళాశాల వద్దకు రావాలన్నారు. వివరాలకు 7989479371 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

కలశానికి మహిమల కలరింగ్!

- మోసం చేయాలనుకున్న ముఠా
- ఎనిమిది మంది అరెస్ట్... మరో ఇద్దరి పరారీ



వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌ఐ రాంభూపాల్

తనకల్లు: ఓ కలశాన్ని మహిమగలదిగా చూపి దాన్ని విక్రయించి సొమ్ముచేసుకోవాలనుకున్న వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌ఐ రాంభూపాల్ ఈ కేసు వివరాలు వెల్లడించారు. అమడగూరు మండలం కంచనగారిపల్లికి చెందిన రాజేష్, తన స్నేహితులైన సుధాకర్, ప్రేమ్‌కుమార్‌లతో కలిసి సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నారు. సాధారణ కలశానికి మహిమలు ఉన్నట్లు నమ్మించి... దాన్ని ఎక్కువ డబ్బులకు విక్రయించాలని భావించారు. ఈ క్రమంలోనే తనకల్లు మండలం గీతాలవారిపల్లికి చెందిన సోమిరెడ్డి, డీసీ పల్లికి చెందిన బాలకృష్ణ, వేమనారాయణ, కదిరికి చెందిన మెకానిక్ సర్దార్, అహమ్మద్‌బాషా, బాబాఫక్రుద్దీన్, అరీఫ్ హుస్సేన్ కలిసి ముఠాగా ఏర్పడ్డారు. ఈ నెల 9వ తేదీన వీరంతా కలిసి డీసీ పల్లిలోని పురాతన కోదండరాముని ఆలయం గుడి గోపురంపై కలశాన్ని ఉంచి దానికి బ్యాటరీ, ఇన్‌వర్టర్ ద్వారా విద్యుత్ సరఫరా అయ్యేలా చేశారు. దీంతో కలశంపై మెరుపులు రావడంతో అది ఎంతో మహిమ గలదని స్థానికులను నమ్మించారు. దాన్ని ఎక్కువ మొత్తానికి విక్రయించేందుకు సిద్ధం కాగా, సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఎనిమిది మందిని అరెస్టు చేశారు. రాజేష్, బాలకృష్ణ అక్కడి నుంచి పరారయ్యారు. నిందితుల నుంచి రెండు బైకులు, కారు, బ్యాటరీ, ఇన్‌వర్టర్, కరెంట్ వైర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

మెరుగైన సేవలే లక్ష్యం

- కాల్ సెంటర్ ఏర్పాటు చేశామన్న డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి

పుట్టపర్తి టౌన్: వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి వంశీకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1967ను అందుబాటులోకి తెచ్చామన్నారు. పౌరసరఫరాలశాఖ ద్వారా నిత్యావసర వస్తువులు సకాలంలో అందించడమే లక్ష్యంగా 10 మందితో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ పనిచేస్తుందన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పౌరసరఫరాలశాఖ 18004250082-1967, ఒకే దేశం - ఒకే రేషన్ కార్డు 180042553157-14445 రాష్ట్ర ఆహార కమిషన్ 18004252388-155235, తూనికలు కొలతల శాఖ 18004254202-1967లను 1967 ఇంటిగ్రేటెడ్‌కాల్ సెంటర్‌కు అనుసంధానించినట్లు పేర్కొన్నారు. ఈ కాల్‌సెంటర్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పట్టభద్రులూ.. ఓటరుగా నమోదు చేసుకోండి



వెన్నపూస రవీంద్రారెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లాలోని పట్టభద్రులు ఈ నెలాఖరులోపు ఎమ్మెల్సీ పట్టభద్ర ఓటరుగా నమోదు చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ పట్టభద్ర ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి కోరారు. 2019 అక్టోబర్ 30 నాటికి డిగ్రీ తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులైన వారందరూ ఓటరు నమోదుకు అర్హులని తెలిపారు. ఎమ్మెల్సీ ఓటు నమోదుకు మరో అవకాశం ఉన్నందున గ్రాడ్యుయేట్లందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేమన జయంతికి ముమ్మర ఏర్పాట్లు

- 19న కటారు పల్లికి విచ్చేయనున్న పర్యాటక శాఖ మంత్రి రోజా

గాండ్లపెంట: విశ్వకవి, సంఘ సంస్కర్త యోగి వేమన జయంత్యుత్సవాలను ఈ నెల 19న ఘనంగా నిర్వహించేందుకు యంత్రాంగం ఏర్పాట్లు ముమ్మరం చేసింది. వేమన జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం జీఓ జారీ చేసిన నేపథ్యంలో జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగేశ్వరరెడ్డి, డీపీఎం చంద్రమౌళిరెడ్డి, ఈఈ ఈశ్వరయ్యలు మంగళవారం కటారుపల్లిలోని యోగివేమన ఆలయాన్ని సందర్శించారు. జయంతి వేడుకల నిర్వహణ కోసం కటారుపల్లి ఉన్నత పాఠశాల వద్ద జరుగుతున్న పనులు, కటారుపల్లి క్రాస్‌లో వేమన విగ్రహ ప్రతిష్ట ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ పూజారులు, స్థానికులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవి, ఎంపీడీఓ అంజినప్ప, ఈఓఆర్డీ సునీత, ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి, ఎంపీపీ జగన్‌మోహన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భాస్కరరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శంకర నాయుడు, స్థానిక నాయకులు కృష్ణారెడ్డి, ఉత్తన్న పాల్గొన్నారు.

వణికిస్తోంది

- ఉష్ణోగ్రతలు భారీగా పతనం

అనంతపురం అగ్రికల్చర్: ఉష్ణోగ్రతలు పతనమవుతుండటంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో చలి వణికిస్తోంది. మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. సాయంత్రం, రాత్రిళ్లు, ఉదయం పూట మంచుతో కూడిన శీతల వాతావరణం నెలకొంది. చాలా మండలాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల లోపు నమోదవుతున్నాయి. మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా అగళిలో 7.6 డిగ్రీలు, అనంతపురం జిల్లా బెళుగుప్పలో 8.1 డిగ్రీల కనిష్టం నమోదవడం విశేషం. మడకశిర 8.1, శెట్టూరు 8.9, రొద్దం 9.3, తనకల్లు 9.4, గుమ్మఘట్ట 9.6, నల్లచెరువు, విడపనకల్లు 9.8, తలుపుల, హిందూపురం 9.9, కంబదూరు, ఉరవకొండ 10.1, అమడగూరు 10.3, అమరాపురం 10.4 డిగ్రీల కనిష్టం నమోదుకాగా, చలితీవ్రత పెరిగింది.

భూసేకరణ ముమ్మరం

- హైవే ప్రాజెక్టుల్లో వేగం
- అనంతపురం జిల్లాలో 623 హెక్టార్ల భూమి అవసరం
- శ్రీసత్యసాయి జిల్లాలో 1,452 హెక్టార్ల సేకరణ లక్ష్యం
- 2024 డిసెంబరు నాటికి ప్రాజెక్టులు పూర్తయ్యే అవకాశం
- అంతర్రాష్ట్ర కనెక్టివిటీతో ఉమ్మడి జిల్లాలో మెరుగైన రవాణా



ముదిగుబ్బ వద్ద నేషనల్ హైవే కోసం సేకరిస్తున్న భూమి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో జాతీయ రహదారి ప్రాజెక్టులు వేగం పుంజుకున్నాయి. రాష్ట్రంలో పలు జిల్లాలను కలపడంతో పాటు కర్ణాటక రాజధాని బెంగళూరు నుంచి ఆంధ్రప్రదేశ్‌ను కలుపుతూ వివిధ ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. ఈ నేపథ్యంలో భారీ స్థాయిలో భూసేకరణ చేపట్టారు. శ్రీసత్యసాయి జిల్లాలో 1,452 హెక్టార్లు, అనంతపురం జిల్లాలో 623 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంది. అధికార యంత్రాంగం ఇప్పటికే అనంతపురం జిల్లాలో 312 ఎకరాల ప్రైవేటు భూమిని సేకరించింది. శ్రీసత్యసాయి జిల్లాలో 216 ఎకరాల ప్రైవేటు భూమిని సేకరించారు. ఏడాదిన్నరలో ప్రాజెక్టులు పూర్తి చేసే విధంగా ముందుకెళుతున్నారు. రోడ్లతో పాటు పలు ప్రాంతాల్లో వంతెనలు కూడా ఉన్నాయి. ప్రాజెక్టులు మొత్తం 2024 సంవత్సరం చివరికల్లా పూర్తయ్యే అవకాశం ఉన్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి. రెండు జిల్లాల్లోనూ మొత్తం 31 ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ జరుగుతోంది.

వివిధ ప్రాజెక్టుల వివరాలు..

- ఉరవకొండ – అనంతపురం – కదిరి – మదనపల్లి – కుప్పం – కృష్ణగిరి వరకూ మొత్తం 197 కిలోమీటర్ల రోడ్డుకు సేకరణ పూర్తి చేయనున్నారు.
- ధార్వాడ్ – హుబ్లి – గదక్ – కొప్పాల్ – హోస్పేట్ – బళ్లారి – గుత్తి – తాడిపత్రి – ముద్దనూరు – మైదుకూరు – బద్వేల్ – ఆత్మకూరు – నెల్లూరు – కృష్ణపట్నం వరకూ జాతీయ రహదారి–67లో మొత్తం 118 కిలోమీటర్లు చేపడుతున్నారు.
- అనంతపురం – తాడిపత్రి – బనగానపల్లి – గాజులపల్లి – గిద్దలూరు – కంభం – వినుకొండ – నరసరావుపేట – గుంటూరు వరకూ జాతీయ రహదారి 544డీలో భాగంగా భూసేకరణ చేపడుతున్నారు.
- కొడికొండ – లేపాక్షి – హిందూపురం – మడకశిర వరకూ 544ఈ జాతీయ రహదారిలో 102 కిలోమీటర్ల రోడ్డు చేపడుతున్నారు.
- ముదిగుబ్బ జంక్షన్ ఏర్పాటు చేస్తూ కనెక్టింగ్ ఏర్పాటులో భాగంగా పుట్టపర్తి మీదుగా ఎన్‌హెచ్‌–44లో కోడూరు వద్ద కలుపుతారు.
- జాతీయ రహదారి ఎన్‌హెచ్ – 716లో ముద్దనూరు – పులివెందుల – కదిరి – ఓబుళదేవరచెరువు – గోరంట్ల – పాలసముద్రం క్రాస్ నుంచి హిందూపురం ఎన్‌హెచ్ 544ఈకి అనుసంధానిస్తారు.

శ్రీసత్యసాయి జిల్లాలో జాతీయ రహదారి ప్రాజెక్టుల భూసేకరణ

మొత్తం ప్రాజెక్టులు	18
భూసేకరణ అవసరం	1,452 హెక్టార్లు
ఇందులో ప్రభుత్వ భూమి	269 హెక్టార్లు
ప్రైవేటు భూమి	1,183 హెక్టార్లు
ఇప్పటివరకూ ప్రభుత్వ భూమి సేకరణ	73 హెక్టార్లు
ఇప్పటివరకూ ప్రైవేటు భూమి సేకరణ	216 హెక్టార్లు

వేగంగా భూసేకరణ

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల మీదుగా ఏర్పాటవుతున్న పలు జాతీయ రహదారులకు భూసేకరణ వేగంగా జరుగుతోంది. ఇప్పటికే చాలామటుకు పూర్తిచేశాం. ప్రభుత్వ, ప్రైవేటు భూములు ఉన్నాయి. కొంత అటవీ భూములను కూడా డైవర్షన్ చేశారు.

–మధుసూదన్‌రావు, ఈఈ, జాతీయ రహదారులు

నిషేధిత క్రీడల జోలికెళ్లొద్దు


- సంప్రదాయ క్రీడలతో సంక్రాంతి
- అన్ని సబ్ డివిజన్లలో 30 పోలీస్ యాక్టు అమలు
- అనంతపురం రేంజ్ డీఐజీ ఎం.రవిప్రకాష్ వెల్లడి



మాట్లాడుతున్న డీఐజీ రవిప్రకాష్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: సంప్రదాయ క్రీడలతో భోగి, సంక్రాంతి, కనుమ పండుగను సంతోషంగా జరుపుకోవాలని అనంతపురం రేంజ్ డీఐజీ ఎం.రవిప్రకాష్ ప్రజలకు సూచించారు. నిషేధిత క్రీడలైన కోడి పందేలు, జల్లికట్టు, జూదాల జోలికి వెళ్లరాదన్నారు. ఈ క్రీడల్లో పాల్గొన్నా.. ప్రోత్సహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జూదాలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామ మహిళా పోలీసులను సమన్వయం చేసుకుని సీఐలు, ఎస్‌ఐలు గ్రామ పెద్దలతో సమావేశాలు నిర్వహించి నిషేధిత జూదాలు, క్రీడలు జరగకుండా సమాయత్తం చేయాలన్నారు. డీఎస్పీలు అప్రమత్తంగా ఉంటూ పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. కోడి పందేలు, జల్లికట్టు ఆటలు జరిగే వీలున్న ప్రాంతాల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయాలన్నారు. గతంలో కోడి పందేలు, జల్లికట్టు కేసులు నమోదైన వారిని ముందస్తుగా బైండోవర్ చేయాలన్నారు. కోళ్లకు కత్తులు కట్టి పందేలు ఆడటం, జన సమూహాల మధ్యన ఎద్దులను రెచ్చగొట్టి కట్టడి చేయడంలో భాగంగా హింసించడం లాంటి పనులు చేయరాదన్నారు. జల్లికట్టు, కోడి పందేల నిర్వహణ వేదికలకు ఎవరైనా తోటలు, స్థలాలు ఇస్తే వారిపై కూడా కేసులు నమోదు చేయాలన్నారు. అన్ని సబ్ డివిజన్ల పరిధుల్లో 30 పోలీస్ యాక్టు అమలులో ఉంటుందన్నారు. పోలీసుల హెచ్చరికలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. అసాంఘిక కార్యక్రమాల జోలికి వెళ్లకుండా ఇంటిల్లిపాది సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. నిషేధిత క్రీడలు, జూదాల నిర్వహణపై డయల్ 100కు సమాచారమందించాలని విజ్ఞప్తి చేశారు.

నాణ్యమైన బియ్యం అందజేయాలి



నింకంపల్లి రేషన్‌దుకాణంలోని బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

హిందూపురం: రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు నాణ్యమైన బియ్యం అందజేయాలని కలెక్టర్ బసంత్‌కుమార్ ఆదేశించారు. కొలతల్లోనూ ఏమాత్రం తేడా ఉండకూడదన్నారు. మంగళవారం ఆయన హిందూపురం ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు. హిందూపురం మండలం కిరికెర–1, 2, 3 సచివాలయాలను, నింకంపల్లి రేషన్‌దుకాణంతో పాటు బాలంపల్లి, మలగూరు పంచాయతీల్లో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. గ్రామాల్లో ప్రారంభం కాని గ్రామ సచివాలయ భవన నిర్మాణాలు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని, లేని పక్షంలో మరో కాంట్రాక్టరు ద్వారా పనులు చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. సచివాలయ రికార్డులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ..సమయ పాటిస్తూ సకాలంలో సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల అందేలా చూడాలన్నారు. అలాగే రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ నరేంద్ర, సీఎస్‌డీటీ హారతి వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు అరికడదాం

పుట్టపర్తి అర్బన్: మాతాశిశు మరణాలు సంభవించకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ ఎస్‌వీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన పుట్టపర్తి పట్టణ పరిధిలోని ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాతా శిశు మరణాలపై వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. జిల్లా పరిధిలో డిసెంబర్ నెలలో నాలుగు శిశు మరణాలు, ఇద్దరు గర్భిణులు చనిపోవడంతో సమీక్ష నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. మాతా శిశు మరణాలకు చెక్‌పెట్టేలా మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. మృతులు గతంలో తీసుకున్న పౌష్టికాహారం, పొందిన వైద్య సేవల వివరాల రికార్డులను పరిశీలించారు. ఇకపై మాతా శిశు మరణాలు సంభవించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, డీపీఎంఓ కుళ్లాయప్పనాయక్, డీఎల్‌ఓ డాక్టర్ కృష్ణయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు మంజువాణి, సెల్వియా సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలపై సమీక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి



క్లుప్తంగా

లారీని ఢీ కొన్న కియా బస్సు

• ఉద్యోగులకు తప్పిన ముప్పు


దెబ్బతిన్న కియా బస్సు

చెన్నేకొత్తపల్లి: కియా పరిశ్రమ నుంచి ఇళ్లకు ఉద్యోగులను తీసుకెళ్తున్న బస్సు స్థానిక మోడల్ స్కూల్ వద్ద ముందు వెళ్తున్న లారీని ఢీ కొంది. పోలీసుల వివరాల మేరకు... పెనుకొండ పరిధిలోని కియా పరిశ్రమ నుంచి 30 మంది ఉద్యోగులతో మంగళవారం తెల్లవారుజామున ఓ బస్సు బయలు దేరింది. అయితే చెన్నేకొత్తపల్లి సమీపంలోని మోడల్ స్కూల్ దగ్గరకు రాగానే మంగళవారం ముందు వెళుతున్న లారీని బస్సు ఢీ కొంది. ఈ ఘటనలో బస్సు పూర్తిగా దెబ్బతినగా.. అందులో ప్రయాణిస్తున్న ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం ఉద్యోగులను మరో బస్సులో ధర్మవరం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

గోరంట్ల: స్థానిక వినాయకనగర్‌కు చెందిన ఆదినారాయణరెడ్డి (65) అనే వృద్ధుడు సోమవారం అర్ధరాత్రి క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ సుబ్బరాయుడు తెలిపిన వివరాల మేరకు... వినాయకనగర్‌లో నివాసం ఉంటున్న ఆదినారాయణరెడ్డి కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేవాడన్నారు. ఈ నేపథ్యంలో మద్యానికి అలవాటు పడ్డాడని చెప్పారు. ఇందులో భాగంగానే సోమవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుని భార్య రామచంద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బంగారు గొలుసు అపహరణ

హిందూపురం: హిందూపురం టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని కోటా ఏరియాలో మంగళవారం రాత్రి ఓ మహిళ మెడలోని ఏడు తులాల బంగారు తాళిబొట్టు చైన్‌ను దొంగలు అపహరించుకెళ్లారు. విజయలక్ష్మి అనే మహిళ చిల్లర అంగడిని నిర్వహించేవారు. దుకాణాన్ని మూసి వేసి ఇంటికెళ్తుండగా ద్విచక్ర వాహనంలో వచ్చిన ఇద్దరు దుండగులు విజయలక్ష్మి మెడలోని బంగారు చైన్‌ను లాక్కెళ్లారు. బాధితురాలు వారి పట్టుకునేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. ఈ ఘటనపై టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు. కాగా ఇటీవల ఓ ముస్లిం మహిళ మెడలోని గొలుసు కూడా దొంగలు లాక్కెళ్లారని స్థానికులు తెలిపారు.

బొమ్మను చేసి.. ప్రాణం పోసి !

తోలు బొమ్మలు... పేరెత్తగానే తక్కున గుర్తొచ్చేది ధర్మవరం నియోజకవర్గంలోని నిమ్మలకుంట గ్రామమే. ఇక్కడి కళాకారులు తయారు చేసిన కళాకృతులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంతో పలు దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. తోలుబొమ్మల కళాకారులు పలు భాషలు మాట్లాడడమే కాకుండా ఇతర దేశాల వారికి కూడా శిక్షణ ఇస్తున్నారంటే వీరి ప్రతిభ ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు.


రామాయణం ఘట్టాన్ని తెలిపే చిత్రం


బొమ్మల తయారీలో నిమగ్నమైన దళవాయి

- జీవం ఉట్టిపడేలా తోలుబొమ్మల తయారీ
- అమెరికా దాకా అనంత కీర్తి
- హస్తకళలకు కేరాఫ్‌గా మారిన నిమ్మలకుంట
- ప్రభుత్వ చేయూతపై కళాకారుల హర్షం

ధర్మవరం రూరల్: నిమ్మలకుంట గ్రామంలో 400 కుటుంబాలు ఉన్నాయి. ఇందులో 80 కుటుంబాలు తోలు బొమ్మలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నాయి. తోలుబొమ్మల తయారీలో వీరెవరూ స్పెషల్ డిగ్రీలు చేయలేదు. ప్రత్యేక శిక్షణ కూడా తీసుకోలేదు. పొట్టకూటి కోసం అంకిత భావంతో వారు చేస్తున్న ఈ పని కళాభిమానుల మనసు దోచుకుంటోంది.

సంచార జీవితమే...

పూర్వం ఎడ్లబండ్లపై సంచార జీవనం సాగించే కళాకారులు అనంతపురం, కడప, కర్నూలుతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని గౌరీబిదనూరు, చిక్‌బళ్లాపురం తదితర ప్రాంతాలలో తోలుబొమ్మలాటను ప్రదర్శించేవారు. కొన్ని కుటుంబాలు కలిసి కళాకారుల బృందంగా ఏర్పడి రామాయణం, మహాభారత కథలను ప్రదర్శించేవారు. వీరి కళానైపుణ్యానికి మెచ్చి ప్రజలు ధన, కనక, వస్తు రూపంలో ఇచ్చే వాటితో జీవనం సాగించేవారు. ఏడాదికోసారి శివరాత్రి పండుగ సందర్భంగా గ్రామాల్లో బొమ్మలాటను ప్రదర్శించే కళాకారులకు గ్రామంలో కొంత భూమిని మాన్యంగా ప్రకటించేవారు. మాన్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా వీరికి ఇచ్చేవారు.

బొమ్మల తయారీ ఇలా...

సినిమాలు, టీవీల ప్రభావంతో తోలుబొమ్మలాట పూర్తిగా కనుమరుగైంది. దీంతో తోలుబొమ్మలాటనే నమ్ముకున్న కళాకారులు కొత్త ఆలోచనలతో తోలుతో బొమ్మల తయారీపై దృష్టి సారించారు. మేకతోలును బొమ్మల తయారీకి ఉపయోగిస్తారు. చర్మాన్ని బాగా కడిగిన తరువాత ఎండబెడతారు. ఎండిన చర్మంపై తయారు చేయాలనుకున్న బొమ్మను మొదట పెన్సిల్‌తో గీస్తారు. చిన్న చిన్న రంధ్రాల ద్వారా మిగతా భాగాన్ని తొలగించి బొమ్మలకు రంగులు వేస్తారు. ఒక బొమ్మ తయారీకి మూడు నుంచి ఐదు రోజుల సమయం పడుతుంది. బొమ్మలు నచ్చితే పెట్టిన పెట్టుబడికి మూడింతలు వస్తాయని కళాకారులు అంటున్నారు.

ట్రెండ్‌కు అనుగుణంగా..

ప్రజల జీవన పరిస్థితులు కాలక్రమేణ పూర్తిగా మారాయి. దీంతో ట్రెండ్‌కు అనుగుణంగానే వారు బొమ్మలు తయారు చేస్తున్నారు. ల్యాంప్‌సెట్స్, గోడకు వేలాడదీసే బొమ్మలు, బ్యాగులు తదితర వాటిని తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తుంటారు.

జాతీయ అవార్డులు

నిమ్మలకుంటలోని పలువురు హస్తకళల్లో జాతీయస్థాయి అవార్డులను సాధించారు. ప్రాచీన కళలకు జీవం పోసి వాటి మనుగడకు కృషి చేసినందుకు దళవాయి చలపతి, శ్రీరాములు రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. వీరిలో దళవాయి చలపతిని గత ఏడాది కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది.


కళాకారుడి చేతిలో రూపుదిద్దుకున్న ల్యాంప్ సెట్

మార్కెటింగ్‌కు ప్రభుత్వ సహకారం

తోలుబొమ్మల పరిశ్రమకు ప్రభుత్వం చేయూత నిస్తోంది. కళాకారులు తయారు చేసిన బొమ్మలను విక్రయించడానికి ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తోంది. ప్రతి ఏడాది కళాకారులను కొంత మందిని ఎంపిక చేసి ఢిల్లీ, ముంబాయి, చెన్నై, కలకత్తా, బెంగుళూరు తదితర ప్రాంతాల్లో మార్కెటింగ్ సదుపాయం కోసం ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేయిస్తోంది. ఈ స్టాల్స్‌లో వీరు తయారు చేసిన బొమ్మలను విక్రయిస్తుంటారు.


ఢిల్లీలో ఏర్పాటు చేసిన స్టాల్ (ఫైల్)

కళకు గుర్తింపు వచ్చింది



బొమ్మలాటోళ్లను దేశ దిమ్మరులని సంబోధిస్తుంటారు. కొన్నేళ్ల క్రితం వరకూ ఎడ్ల బండ్లలో గ్రామాలకు వెళ్లి తోలుబొమ్మలాటను ప్రదర్శించేవాళ్లం. రాను రాను ఈ కళ అంతరించిపోతోందని చాలా బాధ వేసింది. అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో తోలుబొమ్మల కళాకారులకు ఎంతో ప్రోత్సాహం ఉండేది. ఈ కళకు గుర్తింపు ఇచ్చి మమ్మల్ని అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ తదితర దేశాలలో బొమ్మల తయారీలో అక్కడి విద్యార్థులకు శిక్షణ ఇప్పించేందుకు పంపించారు. భారత దేశంలోని అపురూపమైన కళలను ప్రపంచదేశాలకు చాటి చెప్పాం. ఒక నాటకానికి రోజుకు ఇరవై డాలర్లు అప్పట్లో ఇచ్చేవారు. మారుమూల గ్రామంలో పుట్టి పెరిగిన మాకు అప్పట్లో విమానాల్లో వెళ్లడం చెప్పలేనంత అనుభూతినిచ్చింది. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం తోలుబొమ్మల కళను మెచ్చి పద్మశ్రీ అవార్డు ఇచ్చి గౌరవించడం ఎంతో సంతోషంగా ఉంది. అదే విధంగా వైఎస్సార్ అవార్డును కూడా అందుకున్నాను.

– దళవాయి చలపతి, పద్మశ్రీ అవార్డు గ్రహీత, నిమ్మలకుంట

చాలా ఆనందంగా ఉంది



కనుమరుగవుతున్న తోలుబొమ్మల కళకు ప్రపంచ గుర్తింపు రావడం ఎంతో సంతోషంగా ఉంది. నాటి జీవన పరిస్థితులను పోల్చుకుంటే నేడు ఎంతో ప్రగతి సాధించాం. మా వృత్తిని వంశపార్యంపరంగా కొనసాగించడానికి మా పిల్లలకు కూడా ఈ కళను వారసత్వంగా అందిస్తున్నాం. మామూలుగా జూన్, జూలై మాసాలలో బొమ్మల ప్రదర్శనలు ఎక్కువగా ఉంటాయి. మా కళను ప్రభుత్వాలు గుర్తించడం చాలా సంతోషంగా ఉంది.

– రమణ, కళాకారుడు, నిమ్మలకుంట

రామాలయంలో చోరీ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న సీతారామాలయంలో మంగళవారం తెల్లవారుజామున దొంగలు హుండీని పగలకొట్టి దాదాపు రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లారు. అర్చకులు హుండీ తాళం పగలకొట్టిన విషయాన్ని గమనించి టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'హెవీ డ్రైవింగ్' లో శిక్షణ

పుట్టపర్తి టౌన్: ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌లో శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ ఒక ప్రకటనలో తెలిపారు. హిందూపురం పట్టణంలో ఏర్పాటు చేసిన డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి ఉత్తీర్ణులై లైట్ వెహికల్ లైసెన్స్ కలిగిన వారు అర్హులన్నారు. ఇప్పటి వరకు 14 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చామని, మొత్తం 224 మంది మందికి హెవీ డ్రైవింగ్ లైసెన్సులు పొందారన్నారు. బ్యాచ్‌కు 16 మంది డ్రైవర్లకు మాత్రమే శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో పాటు విడి భాగాల మరమ్మతుపై శిక్షణ , 16 గంటల పాటు డ్రైవింగ్‌లో ప్రాక్టికల్‌గా శిక్షణ ఇస్తామన్నారు. 36 రోజుల శిక్షణ నిమిత్తం ఫీజు రూ.20 వేల ఉంటుందని, జీఎస్టీ అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు హిందూపురం డిపో మేనేజర్ సెల్: 9959225858 సంప్రదించాలన్నారు.

డీజిల్ ట్యాంకర్ సీజ్

గోరంట్ల: మండల పరిధిలోని కొండాపురం క్రాస్ వద్ద మంగళవారం ఉదయం ఎలాంటి బిల్లులు లేకుండా డీజిల్ తరలిస్తున్న ట్యాంకర్‌ను సీజ్ చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం బాగేపల్లి నుంచి కదిరి వైపునకు ఎలాంటి బిల్లులు లేకుండా వెళ్తున్న డీజిల్ ట్యాంకర్ (ఏపీ39టీఎఫ్5556)ను కొండాపురం క్రాస్ వద్ద సీజ్ చేశామన్నారు. సీజ్ చేసిన ట్యాంకర్‌ను ధర్మవరం సీటీఓ ఆఫీస్‌కు తరలించగా రూ.1,20,000 పెనాల్టీ విధించినట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ 'సంక్రాంతి స్పెషల్'

- జిల్లా నుంచి 70 ప్రత్యేక సర్వీసులు
- సాధారణ చార్జీలతోనే ప్రత్యేక ప్రయాణం
- ఇప్పటికే 60 శాతం టికెట్లు రిజర్వు



పుట్టపర్తి టౌన్: సంక్రాంతి సందడి జిల్లా అంతటా కనిపిస్తోంది. సాగునీరు పుష్కలంగా ఉండటంతో పాడిపంటలతో పల్లెలన్నీ కళకళలాడుతున్నాయి. అందుకే విద్య, ఉద్యోగం, ఉపాధి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లిన వారంతా ఈసారి పండుగను స్వగ్రామంలో చేసుకునేందుకు సిద్ధం అయ్యారు. పాఠశాలలు కూడా సెలవులు ప్రకటించడంతో కుటుంబాలతో సహా పల్లెబాట పడుతున్నారు. పండుగ రద్దీని ముందుగానే అంచనా వేసిన ఆర్టీసీ అధికారులు 70 ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది.

రాను, పోను ప్రత్యేక సర్వీసులు

హైదరాబాదు, బెంగళూరు, తిరుపతి, విజయవాడ తదితర ప్రాంతాల్లో ఉంటున్న వారు పండుగకు స్వగ్రామాలకు వచ్చేందుకు వీలుగా ఆర్టీసీ ఆయా ప్రాంతాల నుంచి ఈ నెల 11వ తేదీ నుంచి 50 ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసింది. అంతేకాకుండా పండుగ ముగిసిన తర్వాత వారంతా తిరిగి వెళ్లేందుకు వీలుగా 15 నుంచి 18వ తేదీ వరకూ 50 సర్వీసులు నడుపుతోంది. ఇక అనంతపురం – పుట్టపర్తి మధ్య 20 ప్రత్యేక సర్వీసులు నడిపేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

ప్రత్యేక సర్వీసులు ఇలా...

ప్రాంతం	సర్వీసుల సంఖ్య
హైదరాబాద్	15
బెంగళూరు	20
తిరుపతి	5
విజయవాడ	10
అనంతపురం-పుట్టపర్తి	20

సాధారణ చార్జీలతోనే ...

గతంలో ఆర్టీసీ ప్రత్యేక సర్వీసు నడిపితే అందులో చార్జీ ఎక్కువగా ఉండేది. అయితే ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమైన నేపథ్యంలో ప్రయాణికులకు భారం మోపకుండా జగన్ సర్కార్ చర్యలు చేపట్టింది. ప్రత్యేక సర్వీసుల్లోనూ సాధారణ చార్జీలే వసూలు చేసేలా ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించడంతో ప్రత్యేక సర్వీసుల్లో ఇప్పటికే ప్రయాణికులు 60 శాతం సీట్లు రిజర్వ్ చేసుకున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూధన్ తెలిపారు.

లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా ఇసుక


యర్రవంకపల్లిలో పునాది నిర్మాణాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈ నాగరాజు

నల్లమాడ: ప్రభుత్వ పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం సకాలంలో ఇసుక సమకూరుస్తామని హౌసింగ్ డీఈ నాగరాజు తెలిపారు. మండలంలోని యర్రవంకపల్లిలో మంగళవారం ఆయన పక్కా గృహ నిర్మాణాలను పరిశీలించారు. ప్రభుత్వం సరఫరా చేసిన సిమెంట్‌తో లబ్ధిదారులు పునాదుల నిర్మాణం పూర్తిచేయడంపై డీఈ సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలోనే ఇసుక రీచ్‌లను సైతం ఏర్పాటు చేసి లబ్ధిదారులకు ఇసుకను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వరుణ్, సర్పంచ్ రజనీకాంత్‌రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మురళీనాయక్ పాల్గొన్నారు. అనంతరం ఏఈ వరుణ్ చారుపల్లి, సానేవారిపల్లి, బసిరెడ్డిపల్లి గ్రామాల్లో పక్కాగృహాల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులకు తగిన సూచనలు, సలహాలిచ్చారు.

అందుబాటులో యూరియా


రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ గీత

పుట్టపర్తి: ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవడంతో పాటు చెరువులు, బోరుబావులు జలకళను సంతరించుకున్నాయని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ గీత తెలిపారు. ఈ నేపథ్యంలో అధిక సంఖ్యలో రైతులు పంటలు సాగు చేశారని, ఇందులో భాగంగానే వారికి కావాల్సిన యూరియా, రసాయన మందులు అందుబాటులో ఉంచామన్నారు. మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మంగళవారం బుక్కపట్నం రైతు భరోసా కేంద్రంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఎరువులు, మందులు లేవని ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకూడదనే ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా తక్కువ ధరకే అందిస్తోందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఈఓ సునీత, గ్రామ అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆదినారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈ, సర్పంచ్ మధ్య వాగ్వాదం

• పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు


పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన సర్పంచ్, గ్రామస్తులు

పెనుకొండ రూరల్: మండలంలోని కురుబవాండ్లపల్లి పంచాయతీలో సర్పంచ్ నాగమూర్తి ,రొద్దం ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసుమూర్తి మధ్య మంగళవారం వాగ్వావాదం చోటుచేసుకుంది. ఇందులో భాగంగానే వారు కియా పోలీసుస్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేశారు. మూడు మండలాల అధికారులతో కలసి విద్యుత్ పెండింగ్ బిల్లుల సేకరణ కోసం వెళ్లడంతో సర్పంచ్ నాగమూర్తి దుర్భాషలాడటంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాధు చేసినట్లు పేర్కొన్నారు. అయితే ఏఈ శేఖర్ తన ఇంట్లోకి అనుమతి లేకుండా ప్రవేశించి దుర్భాషలాడారని, అలాగే గ్రామంలో మరికొందరితో కూడా ఇదే విధంగా ప్రవర్తించారని సర్పంచ్ నాగమూర్తి తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రామగిరి: మండల పరిధిలోని ఎగువపల్లి సమీపంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు తెలిపారు. మంగళవారం కర్ణాటక సమీపంలోని చెక్‌పోస్ట్‌లో వాహనాల తనిఖీ చేస్తుండగా మినీలారీ (ఏపీ16 టీఎస్4585)లో 99 బస్తాలు బియ్యాన్ని తరలిస్తుండగా గుర్తించామన్నారు. కర్ణాటకలోని పావగడకు రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా యర్రగుంట్ల వినోద్ కుమార్‌రెడ్డి, తగరకుంట నరేష్, సనప గంగమ్మను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. బియ్యంతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ముదిగుబ్బ: మండల కేంద్రం నుంచి బెంగళూరుకు తరలిస్తున్న 580 క్వింటాళ్ల బియ్యాన్ని మంగళవారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ సీఐ సాయిప్రసాద్ మాట్లాడుతూ 9 వాహనాల్లో 1134 బియ్యం ప్యాకెట్లను తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వాహనాలతో పాటు 15 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు.

• సుబ్బమ్మ.. కన్నీటి చెమ్మ!



చేతికెదిగేవరకూ పసిపిల్లలని పెంచింది. ఏడుస్తుంటే తల్లడిల్లింది. ఆకలని తెలుసుకొని గోరుముద్దలు తినిపించింది. పొత్తిళ్లలో ఉంచుకుని జోలపాడి నిద్రపుచ్చింది. బాధలు దిగమింగి బాధ్యతలు మోసింది. చేతుల కష్టంతో కుటుంబాన్ని నడిపింది. ఇన్ని చేసిన సుబ్బ'అమ్మ' తనకంటూ ఏమి మిగుల్చుకుంది? ఏడుగురు సంతానమున్నా ఏ ఒక్కరూ వెన్నంటిలేరు. ఏడుపదుల వయసులో మిగిలిందల్లా జీవన భృతి కోసం చేతివృత్తి మాత్రమే. శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన సుబ్బమ్మకు ఐదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. వీరందరికీ పెళ్లిళ్లు చేసి, బరువు బాధ్యతలు దించుకుంది. ఆమె మాత్రం అనంతపురం సర్వజనాస్పత్రి ఆవరణలో తలదాచుకుంటూ కుర్చీలకు అల్లికలతో వచ్చే అంతో ఇంతో ఆదాయంతో పొట్టపోసుకుంటోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



రెండో రౌండ్‌లో రామ్‌కుమార్ జోడీ

అడిలైడ్ ఓపెన్ ఇంటర్నేషనల్-2 టెన్నిస్ టోర్నీలో రామ్‌కుమార్ రామనాథన్ (భారత్)-రేయస్ వరేలా (మెక్సికో) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రామ్-వరేలా ద్వయం 6-3, 7-6 (7/4)తో రాబిన్ హాస్-మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జోడీని ఓడించింది. 76 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్-వరేలా 14 ఏస్‌లు సంధించింది. రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీకి నేరుగా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు 'బై' లభించింది.



ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రీజ

ప్రపంచ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీటీసీ) ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. దోహాలో మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో శ్రీజ 11-2, 5-11, 2-11, 5-11, 13-11, 11-9, 11-8తో చెన్ జు యు (చైనీస్ తైపీ)పై గెలిచింది. భారత్‌కే చెందిన మనిక బత్రా 13-11, 11-9, 11-6, 11-8తో చెంగ్‌జు జు (హాంకాంగ్)పై గెలుపొందగా... దియా చిటాలె, స్వస్తిక, రీత్ టెనిసన్ ఓడిపోయారు.

భారత్ 'టాప్'గేర్

- 'శత'క్కొట్టిన కోహ్లి
- రోహిత్, గిల్ దూకుడు
- తొలి వన్డేలో లంకపై 67 పరుగులతో భారత్ విజయం
- షనక సెంచరీ వృథా
- కోల్‌కతాలో రేపు రెండో వన్డే

కొత్త ఏడాదిలో ఆడిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత జట్టు దుమ్మురేపింది. సొంతగడ్డపై ఈ ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ టోర్నీకి భారీ విజయంతో సన్నాహాలు మొదలుపెట్టింది. దాదాపు నాలుగేళ్ల నిరీక్షణకు తెరదించుతూ కోహ్లి స్వదేశంలో వన్డేల్లో మళ్లీ సెంచరీ కొట్టగా... రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్ కూడా మెరిశారు. ఫలితంగా శ్రీలంకపై గెలుపుతో 'వరల్డ్‌కప్ నామ' సంవత్సరానికి టీమిండియా ఘనమైన ఆరంభాన్నిచ్చింది.

గువహటి: 'టాప్'ఆర్డర్ బ్యాటర్ల వీరవిహారం చేయడంతో శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి వన్డేలో టీమిండియా 67 పరుగుల ఆధిక్యంతో ఘనవిజయం సాధించి సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో వన్డే రేపు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరుగుతుంది. మొదట భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 373 పరుగుల భారీ స్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విరాట్ కోహ్లి (87 బంతుల్లో 113; 12 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో కదంతొక్కాడు. ఓపెనర్లు రోహిత్ శర్మ (67 బంతుల్లో 83; 9 ఫోర్లు, 3 సిక్సర్లు), శుబ్‌మన్ గిల్ (60 బంతుల్లో 70; 11 ఫోర్లు) చెలరేగారు. అనంతరం శ్రీలంక 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 306 పరుగులు చేసి ఓడిపోయింది. కెప్టెన్ దసున్ షనక (88 బంతుల్లో 108 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్సర్లు) అజేయ సెంచరీ సాధించాడు. నిసాంక (80 బంతుల్లో 72; 11 ఫోర్లు) రాణించాడు.

అదరగొట్టిన ఓపెనర్లు

విశ్రాంతి తర్వాత ఈ ఏడాదిని ఆరంభించిన కెప్టెన్ రోహిత్ శర్మ మునుపటి 'హిట్‌మ్యాన్'లా ఆడాడు. గిల్‌తో కలిసి ఇన్నింగ్స్‌కు శుభారంభం అందించాడు. రజిత వేసిన ఏడో ఓవర్లో రోహిత్ 2 సిక్స్‌లు, ఒక బౌండరీతో 17 పరుగులు పిండుకున్నాడు. మదుషంక ఓవర్లో 'హ్యాట్రిక్' ఫోర్లతో టచ్‌లోకి వచ్చిన గిల్ కూడా బాదడం మొదలు పెట్టడంతో లంక బౌలర్లకు కష్టాలు తప్పలేదు. దునిత్ 19వ ఓవర్లో గిల్ 4, 4, 4, 1 కొడితే ఆఖరి బంతిని రోహిత్ సిక్సర్‌గా బాదాడు. 20వ ఓవర్ వేసిన షనక... గిల్‌ను అవుట్ చేసి 143 పరుగుల భాగస్వామ్యానికి తెరదింపాడు.

కోహ్లి కమాల్...

గిల్ అవుటయ్యాక కోహ్లి రాగా... కాసేపటికే రోహిత్‌ని మదుషంక బౌల్డ్ చేశాడు. లంక హమ్మయ్య! అనుకునేలోపే మరో ధాటైన ఇన్నింగ్స్‌కు కోహ్లి శ్రీకారం చుట్టాడు. బౌండరీలతో చకచకా పరుగులు రాబట్టాడు. ఈ క్రమంలో 47 బంతుల్లో (3 ఫోర్లు, 1 సిక్స్) ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. వ్యక్తిగత స్కోరు 52, 81 పరుగుల వద్ద లైఫ్‌లు పొందిన కోహ్లి సెంచరీ దిశగా తనదైన శైలీ షాట్లతో అలరించాడు. 41వ ఓవర్లో భారత్ 300 మార్క్ చేరుకోగా, కోహ్లి 80 బంతుల్లో (10 ఫోర్లు, 1 సిక్స్) తన వన్డే కెరీర్‌లో 45వ సెంచరీ సాధించాడు. 2019 మార్చి 8న ఆస్ట్రేలియాపై రాంచీలో చివరిసారి స్వదేశంలో వన్డేల్లో కోహ్లి సెంచరీ చేశాడు. 49వ ఓవర్లో కోహ్లిని రజిత అవుట్ చేశాడు.

లంకకు పేస్ దెబ్బ

భారత సీమర్లు సిరాజ్, ఉమ్రాన్, షమీల పేస్ బౌలింగ్‌కు శ్రీలంక ఇన్నింగ్స్ ఆరంభం నుంచే కష్టాల్లో పడింది. నిసాంక బాధ్యతగా ఆడినప్పటికీ టాపార్డర్ బ్యాటర్స్ అవిష్క ఫెర్నాండో (5), కుశాల్ మెండిస్ (0)లను సిరాజ్ తన వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత కూడా వరుస విరామాల్లో మిడిలార్డర్ వికెట్లను సీమర్లు కూల్చారు. 206 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి ఓటమిని ఖాయం చేసుకున్న లంకను కెప్టెన్ షనక ఆదుకున్నాడు. షనక టెయిలెండర్ రజిత (9 నాటౌట్)లో కలిసి తొమ్మిదో వికెట్‌కు 100 పరుగులు జోడించారు.

భారత్ క్రీడాస్ఫూర్తి

ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్ వేసిన షమీ... సెంచరీకి రెండే పరుగుల దూరంలో ఉన్న షనక (98 వద్ద) మన్కడింగ్ చేశాడు. నిజానికి ఇది అవుటే! కానీ కెప్టెన్ రోహిత్... షమీ దగ్గరకొచ్చి వారించాడు. వెంటనే షమీ అంపైర్‌తో అప్పీల్‌ను వెనక్కి తీసుకున్నాడు. దీంతో షనక ఐదో బంతికి ఫోర్ కొట్టి సెంచరీ సాధించగలిగాడు.



కోహ్లి సెంచరీ అభివాదం



షనక



9 శ్రీలంకపై అత్యధికంగా తొమ్మిది సెంచరీలు చేసిన బ్యాటర్‌గా కోహ్లి నిలిచాడు. సచిన్ (8) పేరిట ఉన్న రికార్డును కోహ్లి సవరించాడు.

20 స్వదేశంలో అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్‌గా సచిన్ (20) పేరిట ఉన్న రికార్డును తాజా శతకంతో కోహ్లి (20 సెంచరీలు) సమం చేశాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) మదుషంక 83; గిల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షనక 70; కోహ్లి (సి) మెండిస్ (బి) రజిత 113; అయ్యర్ (సి) ఫెర్నాండో (బి) ధనంజయ 28; కేఎల్ రాహుల్ (బి) రజిత 39; పాండ్యా (సి) హసరంగ (బి) రజిత 14; అక్షర్ (సి) ఫెర్నాండో (బి) కరుణరత్నే 9; షమీ (నాటౌట్) 4; సిరాజ్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 373. వికెట్ల పతనం:** 1-143, 2-173, 3-213, 4-303, 5-330, 6-362, 7-364. **బౌలింగ్:** కసున్ రజిత 10-0-88-3, మదుషంక 6-0-43-1, హసరంగ 10-0-67-0, కరుణరత్నే 8-0-54-1, దునిత్ 8-0-65-0, షనక 3-0-22-1, ధనంజయ 5-0-33-1.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) అక్షర్ (బి) ఉమ్రాన్ 72; ఫెర్నాండో (సి) పాండ్యా (బి) సిరాజ్ 5; మెండిస్ (బి) సిరాజ్ 0; అసలంక (సి) రాహుల్ (బి) ఉమ్రాన్ 23; ధనంజయ (సి) రాహుల్ (బి) షమీ 47; షనక (నాటౌట్) 108; హసరంగ (సి) అయ్యర్ (బి) చహల్ 16; దునిత్ (సి) గిల్ (బి) ఉమ్రాన్ 0; కరుణరత్నే (సి) రోహిత్ (బి) పాండ్యా 14; రజిత (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 306. వికెట్ల పతనం:** 1-19, 2-23, 3-64, 4-136, 5-161, 6-178, 7-179, 8-206. **బౌలింగ్:** షమీ 9-0-67-1, సిరాజ్ 7-1-30-2, పాండ్యా 6-0-33-1, ఉమ్రాన్ 8-0-57-3, చహల్ 10-0-58-1, అక్షర్ 10-0-58-0.

గాయత్రి-ట్రెసా జాలీ జోడీ శుభారంభం



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తొలి రోజు భారత్‌కు ఆశాజనక ఫలితాలు లభించలేదు. పురుషుల సింగిల్స్ విభాగంలో కిడాంబి శ్రీకాంత్... మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్, ఆకర్షి కశ్యప్... పురుషుల డబుల్స్‌లో పంజాల విష్ణువర్ధన్ గౌడ్-గరగ కృష్ణప్రసాద్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ శుభారంభం చేసి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. తొలి రౌండ్‌లో గాయత్రి-ట్రెసా జాలీ జోడీ 21-19, 21-14తో యంగ్ ఎన్గా టింగ్-యంగ్ పుయ్ లామ్ (హాంకాంగ్) ద్వయంపై గెలిచింది.

తొలి రౌండ్‌లోనే ఓడిన శ్రీకాంత్, సైనా

మరోవైపు ప్రపంచ మాజీ నంబర్‌వన్ సైనా నెహ్వాల్ 12-21, 21-17, 14-21తో హాన్ యుయె (చైనా) చేతిలో... ఆకర్షి కశ్యప్ 10-21, 8-21తో వెన్ చి సు (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి పాలయ్యారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో విష్ణువర్ధన్-కృష్ణప్రసాద్ ద్వయం 10-21, 18-21తో కాంగ్ మిన్ హూక్-సియో సెయుంగ్ జే (దక్షిణ కొరియా) జోడీ చేతిలో పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 13వ ర్యాంకర్ శ్రీకాంత్ 19-21, 14-21తో ప్రపంచ 17వ ర్యాంకర్ కెంటా నిషిమోటో (జపాన్) చేతిలో అనూహ్యంగా ఓడిపోయాడు. గతంలో నిషిమోటోపై ఐదుసార్లు నెగ్గిన శ్రీకాంత్ 2018 తర్వాత ఈ జపాన్ ప్లేయర్ చేతిలో ఓటమి పాలయ్యాడు.

నేడు జరిగే మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో కరోలినా మారిన్ (స్పెయిన్) పీవీ సింధు; ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా)తో మాళవిక... పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లక్ష్య సేన్‌తో భారత్‌కే చెందిన ప్రణయ్ తలపడతారు.

హైదరాబాద్ 79 ఆలౌట్

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ జట్టు చెత్త ప్రదర్శన కొనసాగుతోంది. మాజీ చాంపియన్ సౌరాష్ట్ర జట్టుతో మంగళవారం జింఖానా మైదానంలో మొదలైన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 30.5 ఓవర్లలో 79 పరుగులకే కుప్పకూలింది. రోహిత్ రాయుడు (23; 4 ఫోర్లు), భగత్ వర్మ (11; 2 ఫోర్లు), అనికేత్ రెడ్డి (10 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్ (3/28), ధర్మేంద్ర సింగ్ జడేజా (3/8) హైదరాబాద్ జట్టును దెబ్బ తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌరాష్ట్ర ఆట ముగిసే సమయానికి 54 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 250 పరుగులు సాధించింది. ప్రస్తుతం సౌరాష్ట్ర 171 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించింది. హైదరాబాద్ బౌలర్లలో అనికేత్ రెడ్డి (3/74), రోహిత్ రాయుడు (2/20) రాణించారు.

రాణించిన జ్ఞానేశ్వర్



న్యూఢిల్లీ: ఢిల్లీ జట్టుతో మంగళవారం మొదలైన రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 74 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 203 పరుగులు సాధించింది. ఓపెనర్ సీఆర్ జ్ఞానేశ్వర్ (81; 14 ఫోర్లు), కెప్టెన్ విహారి (76 బ్యాటింగ్; 11 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు.

తొలిసారి మహిళా అంపైర్లు...

రంజీ ట్రోఫీ మ్యాచ్‌ల్లో మంగళవారం తొలిసారి మహిళా అంపైర్లు అంపైరింగ్ బాధ్యతలు చేపట్టారు. జంషెడ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్-జార్ఖండ్ మ్యాచ్‌కు గాయత్రి వేణుగోపాలన్... సూరత్‌లో రైల్వేస్-త్రిపుర మ్యాచ్‌కు జననీ నారాయణన్... పొర్వోరిమ్‌లో పాండిచ్చేరి-గోవా మ్యాచ్‌కు వృందా రాఠి అంపైర్లుగా వ్యవహరిస్తున్నారు.

'రూట్స్ కొలీజియం'తో జత కట్టిన హంపి



సాక్షి, బంజారాహిల్స్: 'రూట్స్ కొలీజియం ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్' సంస్థ తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్, 2019 ప్రపంచ ర్యాపిడ్ చెస్ విజేత కోనేరు హంపిని నియమించింది. తన కొత్త భాగస్వామ్యంపై హంపి మాట్లాడుతూ...'రూట్స్ కొలీజియంతో కలిసి పని చేయనుండటం సంతోషంగా ఉంది. నా చెస్ అనుభవాలను, ఆలోచనలను ఇక్కడి విద్యార్థులతో పంచుకుంటాను. నాకు తెలిసిన అంశాలు వారికి ఏదో రూపంలో ఉపయోగపడాలని కోరుకుంటున్నా' అని వ్యాఖ్యానించింది. ఈ కార్యక్రమంలో రూట్స్ కొలీజియం చైర్మన్ బీపీ పడాల కూడా పాల్గొన్నారు.

మా ఇల్లే పాన్ ఇండియా

శ్రుతీహాసన్ ఏదీ ప్లాన్ చేయరు. సినిమాలంటే ఆమెకు చాలా ఇష్టం. అయితే ఇన్నేళ్లు ఉండాలని ప్లాన్ చేయలేదు. సినిమాకి దూరం కాకూడదనుకుంటారు. అంతే.. ఇక బాబీ దర్శకత్వంలో చిరంజీవితో చేసిన 'వాల్తేరు వీరయ్య', గోపీచంద్ దర్శకత్వంలో బాలకృష్ణతో చేసిన 'వీరసింహారెడ్డి'తో ఈ సంక్రాంతికి డబుల్ ట్రీట్ ఇవ్వనున్నారామె. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన 'వీరసింహారెడ్డి' ఈ 12న, 13న 'వాల్తేరు వీరయ్య' రిలీజ్ కానున్నాయి. ఈ సందర్భంగా శ్రుతి చెప్పిన విశేషాలు..

● రెండు చిత్రాలతో మీతో మీరే పోటీ పడటం ఎలా ఉంది?

నిజానికి ఇది ఊహించలేదు. తొమ్మిదేళ్ల క్రితం నా రెండు సినిమాలు ఒకేసారి రిలీజయ్యాయి. అయితే పండగప్పుడు కాదు. ఫెస్టివల్ టైమ్‌లో రెండు పెద్ద చిత్రా లతో.. ఇద్దరు లెజెండరీ (చిరంజీవి, బాలకృష్ణ) హీరోల సినిమాలతో రావడం ఆశీర్వాదం అనుకుంటున్నా.

● రెండు సినిమాలూ హిట్టవ్వాలనే ఓ టెన్షన్ ఉంటుంది కదా...

టెన్షన్ అనేది సెట్లో పని చేస్తున్నప్పుడు మాత్రమే. ఎక్స్‌ప్రెషన్ సరిగ్గా వచ్చిందా? లేదా డైలాగ్ బాగా చెప్పానా? లేదా అనే టెన్షన్ ఉంటుంది. సెట్ నుంచి బయటికొచ్చేస్తే టెన్షన్ ఉండదు. ఎందుకంటే మిగతా దంతా ప్రేక్షకుల చేతుల్లో ఉంటుంది.

● 'వాల్తేరు..', 'వీరసింహా...'లలో ఏ సినిమాలో మీ పాత్ర బాగుంటుందనే పోలిక రావడం సహజం..

నిజమే. అయితే రెండు సినిమాల కథలు, పాత్రలు, ట్రీట్‌మెంట్ భిన్నంగా ఉంటాయి. నా పాత్రలు డిఫరెంట్‌గా, సవాల్‌గా ఉంటాయి. 'వీరసింహా..'లో నా పాత్ర కామెడీగా ఉంటుంది. కామెడీ చేయడం కష్టం. 'వాల్తేరు...'లో నా పాత్రని బాగా రాశారు.

● చిరంజీవి, బాలకృష్ణలతో డ్యాన్స్ చేయడం...

నైస్ ఎక్స్‌పీరియన్స్. 'వీరసింహారెడ్డి'లోని 'సుగుణసుందరి...' స్టెప్ బాగా రీచ్ అయ్యింది. అలాగే 'వాల్తేరు వీరయ్య'లోని 'శ్రీదేవి... చిరంజీవి' పాట కూడా అద్భుతంగా వచ్చింది.

● ఒక పాట మంచి ఎండ (సుగుణ సుందరి)లో.. మరో పాట (నువ్వు శ్రీదేవి అయితే.. నేను చిరు) విపరీతమైన చలిలో చేసిన అనుభవం గురించి?

ఇండియన్స్‌కి ఎండ సమస్య కాదు. కానీ చలి తట్టుకోవడం కష్టం. పైగా పల్చటి చీరలో మైనస్ 11 డిగ్రీల చలిలో చేయాల్సి వచ్చింది.

● ఈ విషయంలో హీరోయిన్లకే సమస్య. హీరోలు ఫుల్‌గా కవర్ చేసుకునే వీలు ఉంటుంది...

యూనిట్ అంతా నాలుగైదు లేయర్ల కోట్స్ వేసుకుంటే మేం చలిలో డ్యాన్స్ చేశాం (నవ్వుతూ). సార్ (చిరంజీవి) కూడా పెద్దగా కవర్ చేసుకోలేదు. ఒక కోట్.. అంతే.

● 'వీరసింహారెడ్డి' వేడుకలో పాల్గొన్న మీరు 'వాల్తేరు వీరయ్య' వేడుకలో పాల్గొనలేదు.. కారణం?

ఆరోగ్యం బాగాలేదు. పూర్తిగా రికవర్ కాకపోవడంతో వేడుకకు వెళ్లలేకపోయా. ఐయామ్ సో సారీ.

● ఆ మధ్య మీకు తెలుగులో గ్యాప్ వచ్చింది... ఇప్పుడు ఇద్దరు సీనియర్ హీరోలతో, యంగ్ హీరో ప్రభాస్‌తో 'సలార్'.. వరుసగా సినిమాలు చేయడం ఎలా ఉంది?

మా ఇంట్లో మా అమ్మానాన్నని చూసి సినిమా అనేది ఫ్యామిలీ అనిపించింది. ఇక ఇండస్ట్రీ, ఆడియన్స్ పరంగా తెలుగు నాకు రియల్ ఫ్యామిలీ అంటాను. ఎందుకంటే సౌత్‌లో నేను పరిచయం అయింది తెలుగు సినిమాల ద్వారానే. ఒక కొత్త ప్రాంతంలో నాకు మంచి ఆహ్వానం దక్కింది. ప్రేక్షకులు నన్ను అంగీకరించారు. హిట్ ఇచ్చారు. 'క్రాక్' తర్వాత మళ్లీ తెలుగులో వరుసగా సినిమాలు చేయడం ఆనందంగా ఉంది.



శ్రుతీహాసన్

సంక్రాంతి ఎలా జరుపుకుంటారు?
'సంక్రాంతి' అనే పదం నేను తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన తర్వాతే నా లైఫ్‌లోకి వచ్చింది. మాకు తమిళ్‌లో 'పొంగల్' అంటాం. పండగ రోజు పొంగలి వండుతాను. పూజ చేస్తాను. ఫ్యామిలీతో గడుపుతాను.

గోపీచంద్ మలినేని మిమ్మల్ని లక్కీ హీరోయిన్ అంటారు. లక్‌ని మీరు నమ్ముతారా?
లేదు.. హార్డ్ వర్క్‌ని, దేవుడిని నమ్ముతాను. ఒకవేళ ఎవరైనా నన్ను లక్కీ అంటే వాళ్లకు థ్యాంక్స్ చెబుతాను. అయితే నేను లక్, అన్‌లక్‌ని నమ్మను. ఎందుకంటే ఒకప్పుడు నన్ను 'అన్‌లక్కీ' అన్నారు. ఆ తర్వాత 'లక్కీ' అన్నారు. వేరేవాళ్లు నన్ను అలా అనడం ఆశీర్వాదంలా భావిస్తున్నాను.

'పాన్ ఇండియా' ట్రెండ్ గురించి మీ అభిప్రాయం?
నిజానికి నా లైఫ్ చూస్తే.. నేను పాన్ ఇండియన్‌ని (నవ్వుతూ). మా అమ్మ ముంబై (సారిక).. నాన్న (కమల్‌హాసన్) తమిళనాడు. మా డైనింగ్ టేబుల్ మీద మహారాష్ట్రియన్ ఫిష్ కర్రీ, చపాతి, సాంబార్, రైస్ అన్నీ ఉంటాయి. మాది ప్రాపర్ ఇండియన్ హోమ్. అమ్మ ముంబై నుంచి చెన్నై వెళ్లి తమిళ్ నేర్చుకున్నారు. మాట్లాడటం మాత్రమే కాదు.. రాయడం కూడా నేర్చుకున్నారు. నాన్న తమిళ్, తెలుగు, మలయాళం, హిందీ, బెంగాలీ.. ఇలా చాలా భాషలు మాట్లాడతారు. ఇంట్లో హిందీ, తమిళ్, ఇంగ్లిష్ మాట్లాడతాం. నా చిన్నప్పుడు ఒక సినిమా రిలీజ్ అంటే ముంబై, అట్నుంచి ఫ్లైట్‌లో హైదరాబాద్, లేకపోతే చెన్నై.. ఇలా వెళ్లేవాళ్లం. పాన్ ఇండియా కాన్సెప్ట్ అనేది నా మైండ్‌లో చిన్నప్పుడే ఉంది. అయితే బాలీవుడ్, టాలీవుడ్ అని పేరు వచ్చినప్పుడు మా నాన్న 'ఇండియన్ సినిమా అందాం. ఆ తర్వాత భాష గురించి మాట్లాడదాం' అనేవారు. నేను పుట్టి, పెరిగింది చెన్నైలోనే. కానీ హిందీ సినిమా ద్వారా హీరోయిన్‌గా పరిచయమయ్యాను. అట్నుంచి తెలుగుకి వచ్చాను. ఆ తర్వాతే తమిళ్‌కి పరిచయం అయ్యాను. చెప్పాలంటే 'మా ఇల్లే పాన్ ఇండియా'. ఇప్పుడు పాన్ ఇండియా అంటూ అందరూ అన్ని సినిమాలూ చూడటం పాజిటివ్ విషయం.

సీనియర్ హీరోల సరసన సినిమా చేస్తే ఇక ఆ హీరోయిన్ సీనియర్ హీరోల సినిమాలకే అని ఫిక్స్ అవుతుంటారు. ఇలాంటి టైమ్‌లో ప్రభాస్‌లాంటి యంగ్ హీరోతో 'సలార్' చాన్స్ రావడం అడ్వాంటేజ్ అనుకుంటున్నారా?
కథ, నా క్యారెక్టర్ మాత్రమే చూస్తాను. 'వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య' కథలు, నా పాత్రలు నచ్చాయి. ఫస్ట్ నుంచీ సినిమాని సినిమాగా చూసి, ఒప్పుకోవడం నాకు అలవాటు. అంతేకానీ వేరేవాళ్లు ఏమనుకుంటారో అని ఆలోచించి ఒప్పుకోను. నాకు ఏది కరెక్ట్ అనిపిస్తే అది చేస్తాను. 'సలార్' విషయానికి వస్తే.. నటుడిగా ప్రభాస్ అంటే ఇష్టం. ప్రశాంత్ సార్ సినిమాలంటే ఇష్టం. ఆ పరంగా నేను హ్యాపీ. అది నాకు అడ్వాంటేజ్ అనుకుంటున్నాను.

సినిమా

ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో... పది భారతీయ చిత్రాలు



ప్రతిష్ఠాత్మక 95వ ఆస్కార్ అవార్డ్స్ వేడుక ఈ ఏడాది మార్చి 12న జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా 301 చిత్రాలు ఈ ఏడాది ఆస్కార్ పురస్కారాల కోసం పోటీ పడుతున్నాయి. వాటిలో ఇండియా నుంచి 10 సినిమాలు ఆస్కార్ అవార్డుల నామినేషన్ బరిలో ఉన్నాయి. తొలి జాబితాలో 'ఆర్ఆర్ఆర్ (తెలుగు), చెల్లో షో (గుజరాతీ), మీ వసంతరావ్ (మరాఠీ), తుజ్యా సాఠీ కహీ హై (మరాఠీ), ఇరవిన్ నిళల్ (తమిళ్)' వంటి చిత్రాలు ఇప్పటికే ఆస్కార్ నామినేషన్స్ షార్ట్ లిస్ట్‌లో ఉన్నాయి. కాగా ఆస్కార్ అవార్డులకు పోటీపడేందుకు అవకాశం ఉన్న 301 చిత్రాల్లోని మిగతా జాబితాను అవార్డ్స్ కమిటీ మంగళవారం వెల్లడించింది. అందులో 'ది కశ్మీరీ ఫైల్స్' (హిందీ), 'గంగూబాయి కతియావాడి' (హిందీ), 'కాంతార' (కన్నడ), 'విక్రాంత్ రోణ' (కన్నడ), 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' (తమిళ్)' చిత్రాలు ఉన్నాయి. కాగా ఇండియా తరఫున గుజరాతీ సినిమా 'ఛెల్లో షో' ఆస్కార్ బరిలో నిలుస్తున్నట్లు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా 'ఆర్ఆర్ఆర్' సినిమాతో పాటు మరికొన్ని చిత్రాలు ఓపెన్ కేటగిరీలో నిలిచాయి.

ఇక ఏయే సినిమా ఏయే విభాగంలో పోటీ పడుతుందనే విషయానికి వస్తే.. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్ఆర్ఆర్' బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగం (నాటు నాటు.. పాట)లో షార్ట్ లిస్ట్‌లో నిలిచింది. ఈ చిత్రానికి కీరవాణి సంగీత దర్శకుడు. అలాగే ఉత్తమ విదేశీ చిత్రం కేటగిరీలోనూ 'ఆర్ఆర్ఆర్' షార్ట్‌లిస్ట్ అయిన సంగతి తెలిసిందే.

కాగా ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు విభాగాల్లో 'కాంతారా' ఎంపికైంది. రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ఇది.

అదే విధంగా సుదీప్ హీరోగా అనూప్ బండారి దర్శకత్వం వహించిన కన్నడ చిత్రం 'విక్రాంత్ రోణ', సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో ఆలియా భట్ టైటిల్ రోల్‌లో నటించిన బాలీవుడ్ చిత్రం 'గంగుబాయి కతియావాడి', వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వంలో రూపొందిన 'ది కశ్మీరీ ఫైల్స్' వంటివి ఉత్తమ చిత్రం కేటగిరీలో షార్ట్ లిస్టులో చోటు సంపాదించుకున్నాయి.

నేటి నుంచి ఓటింగ్ ప్రారంభం కానుంది. ఈ నెల 17 వరకు ఓటింగ్‌కు అవకాశం ఉంటుంది. షార్ట్ లిస్ట్‌లోని తుది నామినేషన్లను ఈ నెల 24న ప్రకటిస్తారు.

పోటీ ఉన్నప్పుడే మంచి కంటెంట్ వస్తుంది

- ఎస్ఎస్ తమన్



''పోటీ అనేది సినిమాల్లోనే కాదు.. ప్రతి చోటా ఉంటుంది. పోటీ ఉన్నప్పుడే మంచి కంటెంట్ వస్తుంది. ఆరోగ్యకరమైన పోటీ మంచిదే. అన్ని సినిమాలూ గొప్పగా ఆడాలి.. అందరూ బాగుండాలి'' అని సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ అన్నారు. బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా రేపు (గురువారం) రిలీజవుతోంది. ఈ చిత్రానికి సంగీతం అందించిన తమన్ చెప్పిన విశేషాలు.

● బాలకృష్ణగారితో నేను చేసిన 'అఖండ' సినిమాతో 'వీరసింహారెడ్డి'కి పోలికే లేదు. ఇది కల్ట్ మూవీ. ఎమోషనల్, సిస్టర్ సెంటిమెంట్, బాలకృష్ణగారి మాస్.. ఇలా అన్ని అంశాలతో అదిరిపోతుంది. ● దర్శకుడు మంచి సినిమా తీస్తేనే నేను మంచి మ్యూజిక్ ఇవ్వగలను. ఒక సినిమాకి పునాది దర్శకుడే. బాలకృష్ణగారి అభిమానిగా గోపీచంద్ చాలా గొప్పగా తీశారు.. దాని వల్లే నాకూ మంచి మ్యూజిక్, నేపథ్య సంగీతం ఇచ్చే అవకాశం వచ్చింది. సినిమా ఏం కోరుకుంటుందో అది ఇవ్వడమే మన పని. ఇందులో 'జై బాలయ్య, సుగుణ సుందరి, మాస్ మొగుడు..' వంటి పాటలన్నీ చక్కగా కుదిరాయి. మాస్ సినిమాలో కూడా కథ నుండే ట్యూన్ పుడుతుంది. ● 'అఖండ'లో మ్యూజిక్‌కి స్పీకర్లు పగిలిపోయాయి. 'వీరసింహారెడ్డి'లోనూ స్పీకర్లు పగులుతాయి జాగ్రత్త అని ముందే చెప్పాను. బాలకృష్ణగారిని చూస్తేనే ఎక్కువ వాయించేయాలనిపిస్తుంది (నవ్వుతూ). చాలా రోజుల తర్వాత సెకండ్ హాఫ్‌లో నాలుగు పాటలు, నాలుగు ఫైట్లతో అదరగొట్టే సినిమా ఇది. పాప్ కార్న్ తినే టైమ్ కూడా ఉండదు.. సినిమాని చూస్తూనే ఉంటారు. ● ఈ సంక్రాంతికి విడుదలవుతున్న చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' రెండూ గొప్పగా ఆడాలని కోరుకుంటున్నాను.

వినరో... విష్ణు తత్త్వం

కిరణ్ అబ్బవరం, కశ్మీరా పర్దేశీ జంటగా మురళీ కిషోర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్‌పై బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 17న రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్‌ని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా 'బన్నీ' వాసు మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ చెప్పినప్పుడే టైటిల్ చెప్పాడు మురళీ కిషోర్. నేను కథ మొత్తం విన్నాక 'ఇందులో ఏమైనా దేవుడి ఎలిమెంట్ ఉందనుకుంటున్నారా?' అని అడిగాడు. విష్ణు తత్త్వం ఇంత క్లారిటీగా కనిపిస్తోంది కదా! అన్నాను. ఒక మనిషి చిరునవ్వుని, అవతలవాడికి సాయపడే విధానాన్ని చాలా కమర్షియల్‌గా చెప్పినందుకు మురళికి థ్యాంక్స్'' అన్నారు. ''ఈ సినిమా మాది అనుకుని పని చేసిన టీమ్‌కి థ్యాంక్స్'' అన్నారు మురళీ కిషోర్. ''గీతా ఆర్ట్స్‌లో సినిమా అవకాశం ఇచ్చిన బన్నీ వాసుగారికి థ్యాంక్స్'' అన్నారు కిరణ్ అబ్బవరం.



● కశ్మీరా, కిరణ్ అబ్బవరం

నా కల తీరుతోంది

- సంతోష్ శోభన్



''నాన్న (శోభన్) దర్శకత్వంలో ప్రభాస్ అన్న నటించిన 'వర్షం' సినిమా 2004లో సంక్రాంతికి విడుదలై హిట్ అయింది. నా సినిమాని కూడా సంక్రాంతికి రిలీజ్ చేసుకోవాలనేది నా కల.. 'కల్యాణం కమనీయం' చిత్రంతో అది తీరుతోంది'' అని హీరో సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియ భవానీ శంకర్ జంటగా నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''ఈ సంక్రాంతికి బిగ్ స్టార్స్ సినిమాలు కూడా విడుదలవుతున్నాయి. నేను కూడా 'వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, వారసుడు' చిత్రాలు చూస్తాను. నా సినిమా కాబట్టి 'కళ్యాణం కమనీయం' నాకు మరింత స్పెషల్. పెళ్లైన ఓ కొత్త జంట తమ వైవాహిక జీవితంలో ఎదురైన పరిస్థితులను తట్టుకుని ఎలా ముందుకు సాగింది? అనేది 'కల్యాణం కమనీయం' కథ. యూవీ క్రియేషన్స్‌లో మూడు చిత్రాలు చేశాను.. మరో ముప్పై చేసేందుకైనా సిద్ధం. నా లైఫ్‌లో పేరున్న దర్శకులు మారుతి, మేర్లపాక గాంధీలాంటి వారితో సినిమాలు చేయడం అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు.